బీసీ రిజర్వేషన్లపై 3 బిల్లులు పెట్టాలి

- లేదంటే న్యాయపరమైన చిక్కులు
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ కలిసి ప్రజాస్వామ్యాన్ని ఓడించాయి
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, మార్చి 6 (నమస్తే తెలంగాణ): బీసీల రిజర్వేషన్ల పెంపుకోసం అసెంబ్లీలో మూడు వేర్వేరు బిల్లులను ప్రవేశపెట్టాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీల రిజర్వేషన్ల అమలు కోసం ఆ బిల్లులను ప్రవేశపెట్టాల్సిందేనని ఆమె స్పష్టం చేశారు. ప్రభుత్వం అలా చేయకపోతే న్యాయపరమైన చిక్కులు ఎదురవుతాయని చెప్పారు. బీసీ రిజర్వేషన్ల పెంపు అంశం గంభీరమైనదని, ఈ విషయంలో ప్రభుత్వం జాగ్రత్తగా ఆలోచించి అడుగులు వేయాలని స్పష్టంచేశారు. గురువారం ఆమె నివాసంలో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీలకు రిజర్వేషన్ అంశం కేంద్ర, రాష్ట్రాల ఉమ్మడి జాబితాలో ఉంటుందని, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల అంశం మాత్రమే రాష్ట్రాల జాబితాలో ఉంటుందని పేర్కొన్నారు. ఉమ్మడి జాబితా, స్థానిక సంస్థల అంశాలను వేర్వేరుగా చేయాలని సూచించారు. రాష్ట్ర జాబితాలో ఉన్న కారణంగా పట్టణ స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడానికి గతంలో కేసీఆర్ రాష్ట్ర స్థాయిలోనే చట్టం తెచ్చి సాధ్యం చేశారని గుర్తుచేశారు.

రాజకీయ క్రీడలో బీసీ బిడ్డలు బలి

బీజేపీ, కాంగ్రెస్ రాజకీయ క్రీడలో బీసీ బిడ్డలు బలవుతున్నారని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. 'కరీంనగర్ పట్టభద్రుల స్థానంలో ప్రజాస్వామ్యం ఓడి, పార్టీలు గెలిచాయి. ఆ రెండు జాతీయ పార్టీలు కలిసి ప్రజాస్వామ్యాన్ని ఓడించాయి' అని ఆమె విమర్శించారు. 'ఆ రెండు పార్టీలు బీసీయేతర అభ్యర్థులను బరిలోకి దింపాయని, పార్టీలపరంగా, సిద్ధాంతపరంగా ఓట్లు చీలాయని తెలిపారు. దీంతో పోటీలో ఉన్న బీసీ అభ్యర్థి గెలవలేకపోయారని చెప్పారు. ఇద్దరు అగ్రవర్ణాల అభ్యర్థులు ఉన్నప్పుడు బీసీలందరూ ఏకమవ్వాలనే నినాదంతో ముందుకెళ్లిన ప్రసన్న హరికృష్ణకు చాలా ఓట్లు వచ్చాయి' అని తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ కుమ్మక్కయ్యాయని బలంగా చెప్పడానికి కరీంనగర్ పట్టభద్రుల ఎన్నికే నిదర్శనమని తేల్చిచెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల తీరు బీసీల పాలిట శాపంగా మారిందని కవిత మండిపడ్డారు.

సోనియాగాంధీకి రాసిన ఉత్తరాలు చూపిస్తున్న ముక్రా(కే) మహిళలు

సోనియాకు ముక్రా(కే) మహిళల ఉత్తరాలు

- గ్యారెంటీలు అమలు చేయాలని డిమాండ్
- స్పందన లేకపోతే సోనియా, ప్రియాంక ఇండ్ల వద్ద ధర్నా చేస్తామని హెచ్చరిక

ఇచ్చోడ, మార్చి 6 : ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముక్రా(కే) మహిళలు ఏఐసీసీ అధినేత్రి సోనియాగాంధీ, ప్రియాంక గాంధీకి గురువారం ఉత్తరాలు రాసి పోస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకంలో 18 ఏండ్లు నిండిన ప్రతి మహిళకు రూ.2500, కల్యాణలక్ష్మితోపాటు తులం బంగారం, డిగ్రీ చేసిన ఆడపిల్లలకు స్కూటీలు ఇస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని, ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డిని ఆదేశించాలని డిమాండ్ చేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఈ హామీలు అమలు చేయాలని, లేనిపక్షంలో తెలంగాణ మహిళలంతా కలిసి ఢిల్లీలోని సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ ఇండ్ల వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

తెలంగాణ రైజింగ్ కాదు.. ఫాలింగ్!

- జీఎస్టీ వృద్ధిరేటు పడిపోవడం వైఫల్యానికి నిదర్శనం
- కరోనా కాలాన్ని తలపిస్తున్న జీఎస్టీ వసూళ్లు
- సీఎం అనాలోచిత నిర్ణయాలతో రిజిస్ట్రేషన్ల ఆదాయం డౌన్
- మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం

హైదరాబాద్, మార్చి 6 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ర్టాన్ని అభివృద్ధి పథం వైపు కాకుండా పతనం వైపు తీసుకెళ్తున్నారని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. సీఎం అనాలోచిత చర్యల కారణంగా రాష్ట్ర ఆదాయం రోజురోజుకు పడిపోతున్నదని మండిపడ్డారు. జీఎస్టీ వసూళ్ల ఆదాయం ఎన్నడూలేనంతగా తగ్గడం ముఖ్యమంత్రి, ఆయన ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత ఆరేండ్లలో ఫిబ్రవరి నెల వస్తు సేవల పన్ను (జీఎస్టీ) కలెక్షన్ వృద్ధిరేటు (2021 కరోనా సంవత్సరం మినహా) ఎప్పుడూ 6% కంటే ఎక్కువే నమోదైందని గుర్తుచేశారు. కానీ, రేవంత్‌రెడ్డి పాలన కరోనా కాలాన్ని తలపిస్తూ జీఎస్టీ వసూళ్లు ఒక శాతానికి మాత్రమే పరిమితమయ్యాయని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో తగ్గిన ప్రజల కొనుగోలు శక్తికి ఇది అద్దం పడుతున్నదని మండిపడ్డారు. హైడ్రా, మూసీ వంటి తలాతోక లేని నిర్ణయాలు, అనాలోచిత చర్యల వల్ల ఆగస్టు 2024 తర్వాత రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం గణనీయంగా తగ్గిందని విమర్శించారు. 2024 ఏప్రిల్-నవంబర్, 2023 ఏప్రిల్-నవంబర్ మధ్య కాలంలో వాహన విక్రయాలతో పోల్చితే -0.8% నమోదైందని పేర్కొన్నారు. జీఎస్టీ ఆదాయంలో తక్కువ వృద్ధి రేటు, రిజిస్ట్రేషన్లు, వెహికిల్ ట్యాక్స్‌లో నెగెటివ్ వృద్ధి రేటు.. రేవంత్‌రెడ్డి 15 నెలల పాలనా వైఫల్యాన్ని వెల్లడిస్తున్నాయని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ప్రజలకు క్షమాపణలు చెప్పి పాలనపై శ్రద్ధ వహించాలని డిమాండ్ చేశారు.

పడకేసిన విదేశీవిద్య పథకం

తెలంగాణ విద్యార్థుల విదేశీ చదువుల కలలను రేవంత్‌రెడ్డి సర్కారు చెరిపివేస్తున్నదని హరీశ్‌రావు మండిపడ్డారు. విదేశీవిద్య పథకం ఏడాదిగా పడకేసిందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సహా అగ్రవర్ణ పేద విద్యార్థులు విదేశాలకు వెళ్లి, ఉన్నత చదువులు చదవాలనే లక్ష్యంతో కేసీఆర్ ప్రారంభించిన ఈ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నీరుగారుస్తున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఒక్క విద్యార్థిని కూడా ఈ పథకం కింద ఎంపిక చేయలేదని విమర్శించారు. ఏడాదిన్నరగా ప్రక్రియ దరఖాస్తుల దశలోనే నిలిచిపోయిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. గతంలో విదేశీవిద్య పథకం కింద ఎంపికై, విదేశాలకు వెళ్లిన విద్యార్థులు స్కాలర్‌షిప్ డబ్బులు రాక ఆవేదన చెందుతుంటే, ప్రభుత్వానికి చీమ కుట్టినట్టయినా లేకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. నిధులు విడుదల చేయకుండా తాత్సారం చేస్తుండటం, పేద, మధ్యతరగతి విద్యార్థులకు శాపంగా మారిందని మండిపడ్డారు. ఇదే విషయమై డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే, విద్యార్థులు ఇబ్బంది పడుతున్న విషయం ప్రభుత్వం దృష్టికి రాలేదని, స్కాలర్‌షిప్స్ బకాయిల విడుదలకు మార్చి వరకు సమయం ఉన్నదని మంత్రి సీతక్క సమాధానం ఇచ్చారని గుర్తుచేశారు. ఈ మాట చెప్పి మూడు నెలలు అవుతున్నా ఇప్పటివరకు మూడు రూపాయల బకాయిలు కూడా చెల్లించిన దాఖలు లేవని మండిపడ్డారు. ప్రభుత్వం మొద్దునిద్ర వీడి తక్షణమే స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని, విదేశీ విద్య పథకం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేసి పేదలకు విదేశాల్లో చదివే అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలి

- రెడ్కో మాజీ చైర్మన్ వై సతీశ్‌రెడ్డి డిమాండ్

హైదరాబాద్, మార్చి 6 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ ఎన్నికలు కాంగ్రెస్ ప్రభుత్వానికి రెఫరెండం అని, ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఓటమికి బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని రెడ్కో మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. 'తొలి ఏడాది 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి కొత్తగా ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేదు. నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ఎగనామం పెట్టారు. మా పథకాలు అమలైతేనే ఓటు వేయండని రేవంత్‌రెడ్డి చెప్పారు. రైతుబంధు, రైతుభరోసా, బోనస్ అందినవాళ్లే మాకు ఓటు వేయండని పదే పదే ప్రసంగాలు చేశారు. రుణమాఫీ కాలేదు, రైతుభరోసా రాలేదు. బోనస్ బోగస్ అయ్యింది. కాబట్టే గ్రాడ్యుయేట్ ఓటర్లు నిక్కచ్చిగా తీర్పు ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఓడించారు. ఇకనైనా రేవంత్‌రెడ్డి తన అసమర్థతను ఒప్పుకుని రాష్ట్ర ప్రజలకు, నిరుద్యోగ యువతకు క్షమాపణలు చెప్పి సీఎం పదవికి రాజీనామా చేయాలి' అని గురువారం ఒక ప్రకటనలో సతీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు.

సొంత పౌరులపై దక్షిణ కొరియా బాంబుదాడి

- సైనిక విన్యాసాల్లో ఘటన
- 15 మందికి గాయాలు

సియోల్: దక్షిణ కొరియా సైనిక విన్యాసాల్లో గురువారం ప్రమాదం జరిగింది. యుద్ధ విమానాలు పొరపాటున తమ ప్రజల ఇండ్లపై ఎనిమిది బాంబులను వేయడంతో 15 మంది గాయపడ్డారు. పోచియాన్‌లో జరిగిన ఈ సంఘటనలో కొన్ని ఇండ్లు, ఓ చర్చి ధ్వంసమయ్యాయి. సియోల్‌కు ఈశాన్య దిశలో 40 కి.మీ. దూరంలో, ఉత్తర కొరియా సరిహద్దుల్లో ఈ ప్రాంతం ఉంది. ఇక్కడ సైన్యం పెద్ద ఎత్తున నిరంతరం విధులు నిర్వహిస్తుంది. దక్షిణ కొరియా వాయు సేన విడుదల చేసిన ప్రకటనలో, 225 కేజీల బరువైన ఎంకే82 బాంబులు ఎనిమిది షూటింగ్ రేంజ్‌కు వెలుపల పడినట్లు తెలిపింది. వీటిని కేఎఫ్-16 యుద్ధ విమానాలు ప్రయోగించినట్లు చెప్పింది. ఈ ఘటనపై స్థానికులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తంచేశారు. ఇక్కడ సైనిక శిక్షణకు సంబంధించిన కార్యక్రమాలు జరుగుతున్నందువల్ల తాము అనేక సంవత్సరాల నుంచి ఇబ్బంది పడుతున్నామని తెలిపారు.

6 నెలలుగా జీతాల్లేవు

- సూపర్ న్యూమరరీ పోస్టుల్లో ఎంపికైన ఎక్సైజ్ కానిస్టేబుళ్లకు ప్రభుత్వం నరకం
- వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు
- అప్పులతో బతుకుతున్నామని ఆవేదన

హైదరాబాద్, మార్చి 6 (నమస్తే తెలంగాణ) : జిల్లాల పునర్విభజన ప్రకారం కొత్తగా ఏర్పడిన 14 ఎక్సైజ్ స్టేషన్లలో సిబ్బంది కొరతను అధిగమించేందుకు గత ప్రభుత్వం 116 సూపర్ న్యూమరరీ పోస్టులను సృష్టించింది. ఆయా పోస్టుల్లో ఉద్యోగాలు చేస్తున్నవారికి ఇప్పటి ప్రభుత్వం ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు. దీంతో అప్పులు చేసి బతుకుతున్నామని ఎక్సైజ్ కానిస్టేబుళ్లు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. 2024 ఏప్రిల్ 1 నుంచి వారిని జాబ్‌లోకి తీసుకున్న ప్రభుత్వం.. డిపార్ట్‌మెంట్ శిక్షణ, ఫీల్డ్ ట్రైనింగ్ అనంతరం వారిని 116 పోస్టుల్లో భర్తీ చేసింది. అయితే, కొత్త ఎక్సైజ్ సేష్టన్ల వ్యవహారం కార్యరూపం దాల్చకపోవడంతో నేటికీ వారు పోస్టింగ్ కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. నాడు మల్టీజోన్-1లోని భద్రాద్రి జోన్‌లో భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్ అర్బన్, రూరల్‌కు 6 పోస్టులు, మల్టీజోన్-2లోని యాదాద్రిజోన్‌లో సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి భువనగిరి, జనగామకు మరో 6 పోస్టులు ఇచ్చారు. మల్టీజోన్-2లోని చార్మినార్‌జోన్‌లో మేడ్చల్ మల్కాజిగిరి, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్‌కు 104 పోస్టులు కేటాయించారు. కానీ, పోస్టింగ్‌లు ఇవ్వకపోవడంతో వేతనం ఇవ్వడం లేదని ఎక్సైజ్ కానిస్టేబుళ్లు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

బీఆర్‌ఎస్ ఒత్తిడితో భర్తీ..

ఎక్సైజ్ కానిస్టేబుళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, సూపర్ న్యూమరరీ పోస్టులు క్రియేట్ చేసినా వాటిని భర్తీ చేయడం లేదని నాడు బీఆర్‌ఎస్ నేతలు కేటీఆర్, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ వరుసగా ట్వీట్‌లు చేశారు. దీంతో కదిలిన యంత్రాంగం.. హడావిడిగా పోస్టుల భర్తీ మొదలుపెట్టింది. మొదట మూడు నెలలు వేతనాలు ఇచ్చినా.. ఆ తర్వాత పోస్టింగ్ లేదనే కారణంతో తమను పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. సూపర్ న్యూమరరీ పోస్టుల్లో ఉన్న కొందరు ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు పే ప్రొటక్షన్ ఇవ్వడం లేదని వాపోతున్నారు. ప్రభుత్వం తమపై దయచూపి పోస్టింగ్‌లు ఇచ్చి, అందరికీ వేతనం అందేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

టాయిలెట్లలో సమస్య.. 10 గంటల తర్వాత వెనక్కి విమానం

న్యూఢిల్లీ, మార్చి 6: అమెరికాలోని షికాగో నుంచి ఢిల్లీకి బయల్దేరిన ఎయిరిండియా విమానంలో సాంకేతిక సమస్య ఏర్పడింది. టాయిలెట్లు పనిచేయకపోవడంతో 10 గంటలు ప్రయాణించిన అనంతరం తిరిగి బయల్దేరిన ప్రదేశానికే మళ్లించారు. 340 సీట్ల సామర్థ్యమున్న బోయింగ్ 777-337 ఈఆర్ విమానంలో 10 టాయిలెట్లు ఉన్నాయి. విమానం బయల్దేరిన తర్వాత ఒక్కటి మాత్రమే పనిచేసింది. దీంతో ప్రయాణికులకు ఇబ్బంది కలిగించకూడదని విమానాన్ని వెనక్కి మళ్లించారు. ల్యాండ్ అయిన తర్వాత ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్టు ఎయిరిండియా ప్రతినిధి తెలిపారు.

నీటిగట్టు పంచాయితీ.. ఎస్సై దూషణ..

- రైతు ఆత్మహత్యాయత్నం
- ఎస్సై దూషణలే కారణమంటూ కుటుంబ సభ్యుల ఆరోపణ
- పోలీస్‌స్టేషన్ ఎదుట జాతీయ రహదారిపై ధర్నా

వరంగల్ జిల్లా రాయపర్తిలో పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న ఎర్రకుంటతండావాసులు

రాయపర్తి, మార్చి 6 : వరంగల్ జిల్లా రాయపర్తి మండలం ఎర్రకుంటతండాకు చెందిన భూక్యా మల్లూనాయక్ అనే రైతు గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు 108 వాహనంలో వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. మల్లు కుమారుడు భూక్యా బాలాజీ, కుటుంబ సభ్యులు, బంధువులు మండల కేంద్రానికి చేరుకొని పోలీస్‌స్టేషన్ ఎదుట వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. బాలాజీ తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రకుంట తండాలో భూక్యా మల్లూనాయక్‌కు మూడున్నర ఎకరాల పొలం, సపావత్ దాలియానాయక్‌కు రెండున్నర ఎకరాల పొలం పక్కపక్కనే ఉన్నాయి. ఇటీవల బోర్లు వట్టిపోయి నీరు లేక పొలం ఎండిపోతుండడంతో మల్లూనాయక్ ఇద్దరి మధ్య గెట్టుపై బోరు వేసుకునేందుకు యత్నిస్తుండగా, దాలియా కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. దీంతో మల్లూనాయక్ నాలుగు రోజుల క్రితం రాయపర్తి పోలీస్ స్టేషన్ పిర్యాదు చేశారు. దీనిపై ఎస్సై కొంగ శ్రవణ్‌కుమార్ ఏమాత్రం పట్టింపులేకుండా వ్యవహరించడంతోపాటు గురువారం బాలాజీ, మల్లూనాయక్‌ను దూషించారు. ఆత్మాభిమానం దెబ్బతిన్న మల్లూనాయక్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. దాలియానాయక్ కుటుంబానికి ఏకపక్షంగా సహకరిస్తున్న పోలీసులపై చర్యలు తీసుకోవాలని మల్లూనాయక్ బంధవులు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న వర్ధన్నపేట, జఫర్‌ఘడ్ ఎస్సైలు భూక్యా చందర్‌నాయక్, బానోత్ రాంచరణ్‌నాయక్ ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పారు.

ఎలాంటి అసభ్యపదజాతంలో దూషించలేదు..

బోర్ల తవ్వకం వివాదంలో ఇరుపక్షాలు భౌతిక దాడులకు పాల్పడ్డారు. తండావాసుల సమక్షంలో వివాదాన్ని పరిష్కరించుకోవాల్సిందిగా సూచించాను. పోలీస్ స్టేషన్‌లో ఇష్టారీతిన మాట్లాడుతుండడంతో బయట కూర్చుని మాట్లాడుకోవాలంటూ పంపించాను. భూక్యా మల్లూనాయక్, సపావత్ దాలియా నాయక్ పాత పంచాయతీలను మనసులో పెట్టుకొని వివాదాన్ని పెద్దదిగా మార్చేందుకు యత్నిస్తున్నారు.

- కొంగ శ్రవణ్‌కుమార్, ఎస్సై

అఫీషియల్ లిక్విడేటర్ కార్యాలయం
1వ అంతస్తు, "కార్పొరేట్ భవన్", బండ్లగూడ, నాగోల్, హైదరాబాద్-500068,
ఫోన్‌నం.లు 040-29803066/3106,
ఇ-మెయిల్: ol.hyderabad@mca.gov.in

ఫారం నెం.83
(రూల్ 148(1) చూడండి)
గౌరవనీయ తెలంగాణా రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో - హైదరాబాద్ వద్ద (ప్రారంభ అధికారపరిధి)
కంపెనీల చట్టం, 1956 విషయంలో
మరియు
M/s. సువర్ణ ఆగ్రోసింథటిక్స్ లిమిటెడ్ (లిక్విడేషన్‌లో ఉంది) విషయంలో
సి.పి.నం. 133/2012
తమ క్లెయింను నిరూపించుటకు క్రెడిటార్లకు (కార్మికులతో సహా) నోటీస్ ప్రకటన

పైన తెలిపిన కంపెనీ (లిక్విడేషన్‌లో ఉంది) యొక్క క్రెడిటార్లకు (కార్మికులతో సహా) తెలియజేయునదేమనగా కంపెనీల చట్టం, 1956 సెక్షన్ 530 క్రింద ప్రాధాన్యం ఇవ్వబడు వారి సంబంధిత పేర్లు, చిరునామాలు మరియు డెట్ లేదా క్లెయిం మరియు ఏదేని [illegible] వివరాలతో నిర్దిష్ట ఫారంలో సదరు డెట్ లేదా క్లెయింను నిరూపించు అఫిడవిట్‌తో, 07 ఏప్రిల్ 2025 లేదా అంతకుముందుగా అఫీషియల్ లిక్విడేటర్ కార్యాలయం, 1వ అంతస్తు, "కార్పొరేట్ భవన్", బండ్లగూడ, నాగోల్, హైదరాబాద్-500068 వద్ద బట్వాడా లేదా సదరు తేదీలోగా అతనికి చేరువిధంగా అఫీషియల్ లిక్విడేటర్‌కు పోస్ట్‌ద్వారా పంపించి పైన తెలిపిన కంపెనీపై వారి సంబంధిత డెట్స్ లేదా క్లెయింలను రుజువులను తెలంగాణా మరియు ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం యొక్క అఫీషియల్ లిక్విడేటర్‌కు దాఖలు చేయవలసిందిగా వారికి తెలియజేయడమైనది. ఎవరేని క్రెడిటార్ పైన తెలిపిన విధంగా పరిమిత కాల వ్యవధిలోగా అతని/ ఆమె/ వారి అఫిడవిట్ రుజువును దాఖలు చేయుటలో విఫలమైతే అతని/ఆమె/ వారి డెట్ రుజువు ముందు లేదా సందర్భాన్ని బట్టి సదరు పంపిణీ నుండి డివిడెండ్ పంపిణీ ప్రయోజనం నుండి మినహాయించబడును.

అఫీషియల్ లిక్విడేటర్ నుండి వ్రాతపూర్వకంగా నోటీస్ ద్వారా అతని/ ఆమె/ వారి రుజువును పంపిన ఎవరేని క్రెడిటార్ (కార్మికులతో సహా) స్వయంగా లేదా అతని/ఆమె/వారి అడ్వకేట్ ద్వారా సదరు నోటీస్‌లో తెలిపిన సదరు సమయం మరియు ప్రదేశం వద్ద సదరు డెట్ లేదా క్లెయిం విచారణకు హాజరు కావలెను మరియు అతని/ఆమె/ వారి డెట్ లేదా క్లెయింకు అవసరమైన తదుపరి సాక్ష్యాలను దాఖలు చేయవలెను.

తేది: 04 మార్చి, 2025

సం/-
(U.K. [illegible], ICLS)
అఫీషియల్ లిక్విడేటర్,
తెలంగాణా మరియు ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం, హైదరాబాద్

గమనిక: నోటరీ చేయబడిన రూ.20/- నాన్-జ్యుడీషియల్ స్టాంప్ పేపర్‌పై కంపెనీల (కోర్ట్) రూల్స్, 1959 లోని రూల్ 151, 152 మరియు ఇతర వర్తించు రూల్స్ క్రింద నమ్మదగిన పత్రాలతో సహా సంబంధిత ఫారం నెం.66 లేదా ఫారం నెం.67లో క్లెయింను దాఖలు చేయవలెను.

ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉప కులపతిని కలిసి సమస్యలను విన్నవిస్తున్న జూనియర్ అసిస్టెంట్లు

జూనియర్ అసిస్టెంట్ల వేతన వెతలు

- ఓయూ పరిధిలో మూడు నెలలుగా జీతాలు రావట్లేదని ఆవేదన

సుల్తాన్‌బజార్, మార్చి 6 : మూడు నెలలుగా వేతనాలు లేక ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని జూనియర్ అసిస్టెంట్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తమకు ఉద్యోగాలు వచ్చాయన్న సంతోషం లేకుండా పోయిందని వాపోతున్నారు. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో ఒక రూల్ కొనసాగితే, ఉస్మానియాలో అందుకు భిన్నంగా మరో రూల్ కొనసాగుతుందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల ఉద్యోగాలు పొందిన జూనియర్ అసిస్టెంట్లకు ప్రతినెలా వేతనాలు అందిస్తుండగా, ఒక ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో విధులు నిర్వహిస్తున్న 330 మంది జూనియర్ అసిస్టెంట్లకు గత మూడు నెలలుగా, అంటే ఉద్యోగం పొందినప్పటి నుంచి వేతనాలు రావట్లేదని మండిపడుతున్నారు. అంతేకాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులకు సీపీఎస్ విధానంలో పింఛన్ స్కీం అందుబాటులో ఉంటే, ఓయూలో మాత్రం ఎల్ఐసీ లింక్ పింఛన్ అందుబాటులో ఉండటం ఏంటని ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్, ఓయూ వీసీ, విద్యాశాఖ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించినట్టు తెలిపారు. ఇప్పటికైనా అందరిలా తమకూ నెలనెలా జీతాలు ఇవ్వాలని, సీపీఎస్ అమలుచేయాలని డిమాండ్ చేస్తున్నారు.